క్లుప్తంగా

విద్యార్థికి అభినందన


దీపక్‌ను అభినందిస్తున్న సత్యప్రసన్న

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన దాసరి దీపక్ అంతర్జాతీయ అండర్–14 క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న సోమవారం విద్యార్థిని అభినందించారు. దీపక్ చొప్పదండిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. త్వరలో నేపాల్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటాడు.

మద్యం పట్టివేత


పట్టుబడిన మద్యం

జమ్మికుంట: నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న మద్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. టౌన్ సీఐ రవి వివరాల ప్రకారం.. వీణవంక మండలం వల్బాపూర్ గ్రామానికి చెందిన బెల్ట్ షాపు నిర్వాహకుడు దొమటి రాజు జమ్మికుంట పట్టణం నుంచి అక్రమంగా రూ.8,430 విలువ చేసే మద్యాన్ని తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రవి తెలిపారు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని విరిగిన స్తంభం


రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన స్తంభం

జమ్మికుంట: పట్టణంలోని హౌజింగ్‌బోర్డుకాలనీలో సోమవారం సాయంత్రం ట్రాక్టర్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. విద్యుత్ ఏఈ సురేశ్, స్థానిక కౌన్సిలర్ శ్రీపతి నరేశ్ ఘటనా స్థలానికి చేరుకొని కాలనీలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ట్రాక్టర్ యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఏఈ తెలిపారు.

నగదు స్వాధీనం


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణ శివారులోని పర్కాల్ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం రాత్రి వాహనాల తనిఖీల్లో నగదు పట్టుబడినట్లు సీఐ రమేశ్ తెలిపారు. సైదాపూర్ మండలం అమ్మనగుర్తికి చెందిన ఎస్.రాజు వాహనాన్ని తనిఖీ చేయగా రూ.54 వేల నగదు పట్టుబడింది. నగదుకు సంబంధించిన ఆధారాలు సరిగ్గా చూపకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

విరాళాలు తిరిగి అప్పగించాలి

గన్నేరువరం: మాదాపూర్ గ్రామ చెరువు శిఖంలో రామాలయ నిర్మాణానికి మండలంలోని ప్రజలు, ఇతర ప్రాంతాల భక్తుల నుంచి సేకరించిన విరాళాలను తిరిగి అప్పగించాలని కాంగ్రెస్ నాయకులు కొమ్మెర రవీందర్‌రెడ్డి, సంపతి ఉదయ్, మార్గం మల్లేశం, కుమ్మరి సంపత్, సంపతి రాములు డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ, ఏడాది క్రితం బీఆర్ఎస్ జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, మ్యాదరి శ్రీనివాస్ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టుకు వెళ్లడం జరిగిందన్నారు. దీంతో అధికారులు ఆలయ నిర్మాణాన్ని నిలిపివేశారని తెలిపారు. కానీ, ఏడాది గడిచినా వసూలు చేసిన విరాళాలు తిరిగి ఇవ్వడం లేదని ఆరోపించారు.

రాజకీయంతో ముడిపెట్టొద్దు

కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలని ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ మ్యాదరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం హనుమాన్ ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు బండి తిరుపతి, తిరుపతిరెడ్డి, మాడుగుల మోహన్‌రెడ్డి, మార్గం బాలయ్యలతో కలిసి మాట్లాడారు. రామాలయ కమిటీ సమక్షంలో ఎప్పుడైన విరాళాలు, లెక్కల వివరాలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కమిటీ సభ్యులతో అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జెడ్పీటీసీపై ఆరోపణలు మానుకోవాలని, గుడి గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. రామాలయ నిర్మాణం, రాముడి కోసం కేసులకు భయపడమని, ప్రాణ త్యాగానికైనా సిద్ధమన్నారు. కమిటీ సభ్యుల ఆమోదంతోనే విరాళాలు సేకరించామని, వాటిని వ్యక్తిగతంగా ఎవరూ తీసుకోలేదన్నారు.

పైసలు సరిపోలె..

- నిధులు లేక మధ్యలోనే ఆగిపోయిన కమ్యూనిటీ భవనాల నిర్మాణం
- పలు చోట్ల స్థలాల కొరత
- సమావేశాల నిర్వహణకు ఇబ్బంది పడుతున్న కుల సంఘాలు


'అసంపూర్తిగా ఉన్న ఈ నిర్మాణం బొమ్మనపల్లి గ్రామంలోని విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీకి చెందినది. రెండేళ్ల క్రితం దీని నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే రూ.5లక్షలు మంజూరు చేశారు. స్లాబ్ లెవల్ వరకు పనులు పూర్తయ్యాయి. నిధులు సరిపోకపోవడంతో అర్ధంతరంగా పనులు నిలిచిపోయి ఇలా దర్శనమిస్తుంది.'

చిగురుమామిడి: మండలంలోని పలు గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన బీసీ కమ్యూనిటీ భవనాలు నిధులు లేక నీరసించిపోతున్నాయి. బొమ్మనపల్లి, చిగురుమామిడి, సుందరగిరి, ఇందుర్తి, రేకొండ, ముదిమానిక్యం, నవాబుపేట్, చిన్నముల్కనూర్ గ్రామాల్లో కుల సంఘాల భవనాల నిర్మాణాలకు అప్పటి ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ నిధులు మంజూరు చేశారు. కాగా కొన్ని చోట్ల పనులు పూర్తికాగా, పలు గ్రామాల్లో స్థలం లేక, నిధులు సరిపోక పనులు ముందుకు సాగడం లేదు.

ఐదు గ్రామాల్లో విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాళ్లు

మండలంలోని ఇందుర్తి, సుందరగిరి, చిగురుమామిడి, బొమ్మనపల్లి గ్రామాల్లో విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి ఒక్కోదానికి రూ.5 చొప్పున మంజూరు చేశారు. కాగా ఒక్క సుందరగిరిలో మాత్రమే నిర్మాణం పూర్తయింది. మిగతా గ్రామాల్లో స్లాబ్‌లు వేసి వదిలేశారు. సకాలంలో బిల్లులు రాక, మంజూరైన నిధులు సరిపోక కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులు నిలిపివేశారు. మండలంలో 17 గ్రామాలుండగా పెద్ద గ్రామాలకు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. అవి కూడా నిర్ణీత సమయంలో పూర్తికాలేదు. దీంతో ఆయా కుల సంఘాల నాయకులు ఏదైనా సమావేశం నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందుకు సాగని పనులు

మండలంలోని సుందరగిరిలో మున్నూరుకాపు, యాదవ, గౌడ సంఘాల భవనాలకు రూ.5 లక్షల చొప్పున మంజూరు కాగా, గౌడ సంఘం భవనం మాత్రమే పూర్తయింది. మిగతా వాటికి స్థలం లేక పనులు నిలిచిపోయాయి. బొమ్మనపల్లిలో యాదవ, గంగిరెద్దుల, మున్నూరుకాపు, రేకొండలో గౌడ, మున్నూరుకాపు, తాపీ కార్మిక సంఘాల భవనాల పనులు ప్రారంభం కాలేదు. ఇందుర్తిలో రజక సంఘం భవన పనులు ప్రారంభం కాకపోగా, మున్నూరుకాపు భవనం పనులు స్లాబ్‌లెవల్లో ఉన్నాయి. ఇక ముదిమానిక్యంలో గౌడ సంఘానికి మాత్రమే నిధులు మంజూరు కాగా భవనం పూర్తయింది. నవాబుపేట్‌లో రజక, యాదవ సంఘం భవనాలు పూర్తయ్యాయి. చిన్నముల్కనూర్‌లో యాదవ సంఘం భవనం పనులు పురోగతిలో ఉన్నట్లు తాజా మాజీ సర్పంచ్ తెలిపారు. కాగా కుల సంఘాల భవనాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయకుంటే మంజూరైన నిధులు మళ్లిపోయే అవకాశం ఉంటుందని ఆయా సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించేలా సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

స్లాబ్ వరకే పూర్తయింది



రెండేళ్ల క్రితం విశ్వబ్రాహ్మణ సంఘానికి నిధులు మంజూరయ్యాయి. జీఎస్టీ పోనూ రూ.4.50 లక్షలతో భవనం స్లాబ్ వరకు మాత్రమే పూర్తయింది. నిధుల కోసం పలుమార్లు గత ఎమ్మెల్యేకు విన్నవించినా మంజూరు కాలేదు.
– గొల్లపల్లి సదాచారి, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, చిగురుమామిడి

పనులు ప్రారంభించాం



గత ప్రభుత్వంలోనే యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించాం. ప్రస్తుతం ప్రగతిలో ఉన్నాయి.
– కత్తుల రమేశ్, యాదవ సంఘం గ్రామ అధ్యక్షుడు, బొమ్మనపల్లి

ప్రగతిలో పనులు



కొన్ని గ్రామాల్లో భవనాల పనులు ప్రగతిలో ఉన్నాయి. మరికొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభం కాలేదు. స్థలాలు దొరక్క, సకాలంలో అగ్రిమెంటు చేయించుకోలేక, ఇతర కారణాల వల్ల పనులు ప్రారంభం కాలేదు.
– రవిప్రసాద్ డీఈఈ పీఆర్, కరీంనగర్ డివిజన్

వంద రోజుల్లోనే హామీల అమలుకు చర్యలు

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



చొప్పదండి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపే గ్యారంటీల అమలుకు చర్యలు తీసుకుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఆగస్టు 15లోగా రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. రుక్మాపూర్‌లో కొత్తూరి ఆగమ్మ అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచులు కొత్తూరి శంకరయ్య, గజ్జెల సునీత, పంతంగి ప్రభాకర్, ఎన్నం మనోహర్ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పట్టణంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, ముద్దం తిరుపతిగౌడ్, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, మునిగాల సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా కాంగ్రెస్

గంగాధర: అభివృద్ధికి చిరునామా కాంగ్రెస్ అయితే, అబద్ధాలకు కేరాఫ్ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని ఒద్యారం, గోపాల్‌రావుపల్లి గ్రామాలకు చెందిన పలువురు తాజామాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, యువకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణలో బీఆర్ఎస్ పతనం ప్రారంభమైందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమి చెందడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు పురమల్ల మనోహర్, కంకణాల రాజగోపాల్‌రెడ్డి, దుబ్బాసి బుచ్చయ్య, వెలిచాల తిరుమల్‌రావు, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, అట్ల శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయం


సింగాపూర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ప్రణవ్

హుజూరాబాద్‌రూరల్: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమని, కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ కోరారు. సోమవారం రాత్రి మండలంలోని సింగాపూర్ గ్రామంలో ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిప్పారపు సంపత్, నాయకులు కొల్లూరి కిరణ్, కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల విస్తృత ప్రచారం.. చేరికలు

రామడుగు: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా సోమవారం మండలంలోని వెదిర గ్రామంలో ఆపార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ మెన్న రాజమల్లయ్య ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. గ్రామ అధ్యక్షుడు గొల్లపల్లి అంజయ్య, నాగుల రాజశేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. సహకార సంఘం మాజీ చైర్మన్ అలువాల కోటి, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, సంగు దేవయ్య, కటకం తిరుపతి, లింగంపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇంటింటా..

మానకొండూర్: ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు గెలుపు కోసం సోమవారం మండలంలోని చెంజర్ల, ముంజంపల్లి, మానకొండూర్, గంగిపల్లి, గట్టుదుద్దెనపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, తాళ్లపల్లి సంపత్ గౌడ్, ఉపాధ్యక్షుడు సాయిరి దేవయ్య, మాజీ సర్పంచ్ పెంచాల రాజయ్య, గసికంటి సంపత్, పొండ్రాల కనుకరాజేశం, కనుకం సంపత్, కొండ్ర సురేశ్, ఏగోలపు శ్రీనివాస్, ముక్కెర శ్రీనివాస్, రాజేశ్, కొమురయ్య తదితరులున్నారు.

నేడు సీపీఎం కరీంనగర్ పార్లమెంట్‌స్థాయి సమావేశం


బుక్‌లెట్ విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో మంగళవారం సీపీఎం కరీంనగర్ పార్లమెంట్ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి వెల్లడించారు. సోమవారం సీపీఎం ఎన్నికల మేనిఫెస్టో బుక్‌లెట్ విడుదల చేశారు. కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పన్నంగా అమ్మివేసిందని, తనకు కుటుంబమే లేదంటున్న మోదీ అంబానీ, అదాని లాంటి కార్పొరేట్ కంపెనీ తన కుటుంబమని, ప్రజలు కష్టపడి కట్టిన పన్నులను, ప్రభుత్వ రంగ సంస్థలను, కార్పొరేట్ కంపెనీలకు అమ్ముతున్నారని ఎద్దేవా చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గీట్ల ముకుందరెడ్డి, వర్ణ వెంకటరెడ్డి గుడి కందుల సత్యం, జి.బీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి సతీమణి ప్రచారం


ఉపాధి కూలీలను ఓటువేయాలని కోరుతున్న మంత్రి సతీమణి మంజుల

చిగురుమామిడి: చిగురుమామిడి మండల కేంద్రంతోపాటు సీతారాంపూర్ గ్రామాల్లో సోమవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి పొన్నం మంజుల, కుటుంబ సభ్యులు రామకృష్ణ, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడారు. చేతి గుర్తుకు ఓటు వేసి కరీంనగర్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ఓరుగంటి భారతీదేవి, పార్టీ మండలమహిళా అధ్యక్షురాలు పోలు స్వప్న, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్‌కుమార్, నాయకులు పొన్నం సంపత్, పూల లచ్చిరెడ్డి, కోనేటి రాములు, సంజీవ్, రమేశ్, పోటు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పనితీరుపై అసత్య ప్రచారం'

జమ్మికుంట: కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు చూసి ఓర్వలేక మాజీ సీఎం కేసీఆర్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ బీజేపీ ఎంపీ బండి సంజయ్‌పై ఏమి మాట్లాడకపోవడంతో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని తెలుస్తుందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్, వినోద్‌కుమార్ కుటుంబ సభ్యులు వేల కోట్ల అక్రమ ఆస్తులు సంపాదించారని ఆరోపించారు. ఇచ్చిన మాటప్రకారం వంద రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి మేనిఫెస్టోను అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రజలు గమనించి కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు.

'ఎంపీగా 'బండి' పైసా పని చేయలేదు'

సైదాపూర్: గత ఐదేళ్లు ఎంపీగా ఉన్న బండి సంజయ్‌కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి పైసా పని చేయలేదని డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్, కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు దొనకొండ సురేందర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. కరీంనగర్ నుంచి రెండు దఫాలుగా ఎమ్మెల్యేగా ఓడిన సానుభూతితో ఎంపీగా గెలిచిన సంజయ్ మోదీ భజన తప్ప చేసిందేమీ లేదని, కరీంనగర్ ప్రజలు బండికి ఎందుకు ఓటేయ్యాలని ప్రశ్నించారు. మండలంలో రోడ్లు, సాగునీటి సమస్య ఉన్నప్పటికీ ఏనాడు పట్టించుకోలేదని, ఐదేండ్ల కాలంలో సైదాపూర్ మండలానికి ఒక్కసారి కూడా రాలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సాగునీటి సమస్య పరిష్కారానికి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్షించారన్నారు. కరీంనగర్ ఎంపీగా వెలిచాల రాజేందర్‌రావు భారీ మెజార్టీతో గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజా గొంతుకను ఆశీర్వదించండి


మాట్లాడుతున్న మాధవి

చొప్పదండి: పార్లమెంట్‌లో ప్రజా గొంతుకగా పేరున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను ప్రజలు గెలిపించాలని ఆయన సతీమణి డాక్టర్ మాధవి కోరారు. మండలంలోని రెవెల్లి, పెద్దకుర్మపల్లి గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు బందారపు అజయ్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డం చుక్క రెడ్డి, గసికంటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కష్టపడాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

చిగురుమామిడి: బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపునకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, కేడీసీసీబీ వైస్ చైర్మన్ ఉచ్చిడి మోహన్‌రెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం చిగురుమామిడి బీఆర్ఎస్ కార్యాలయంలో మండల వ్యాప్తంగా జరుగుతున్న ప్రచారసరళిపై తెలుసుకున్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, జంగ వెంకటరమణారెడ్డి, పెనుకుల తిరుపతి, పెసరి రాజేశం, బెజ్జంకి రాంబాబు, బోయిని శ్రీనివాస్, ముప్పిడి వెంకటనర్సింహారెడ్డి, బుర్ర తిరుపతి, కల్వల సంపత్‌రెడ్డి, శ్యామకూర సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

హుజూరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ శ్రేణులు సోమవారం 13వ వార్డులో కౌన్సిలర్ కొండ్ర జీవిత–నరేశ్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు మోరె తిరుపతి, మోరె మధు, కొండ్ర నవీన్, మాతంగి అజయ్, అంతడుపుల అరవింద్, మిడిదొడ్డి అశోక్, కొండ్ర ప్రియాంజలి, మోరె రమ్య తదితరులు పాల్గొన్నారు.

'బండి'కి మద్దతుగా బీజేపీ నాయకుల ప్రచారం


గోపాల్‌రావుపేటలో ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న బీజేపీ నాయకులు


ఖాసీంపేటలో బైక్ ర్యాలీ తీస్తున్న బీజేపీ నాయకులు

రామడుగు: బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా సోమవారం మండలంలోని గోపాల్‌రావుపేట, రుద్రారం గ్రామాల్లో ఆపార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జిన్నారం విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి పోచంపల్లి నరేశ్, నాయకులు కళ్లెం శివ, బండారి శ్రీనివాస్, చిరంజీవి, శంకర్, రవి, కట్ట రవీందర్, కోటగిరి నరేంద్రచారి, మహేశ్, శ్రీనివాస్, మల్లేశం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

గన్నేరువరం: బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కి మద్దతుగా సోమవారం బీజేపీ నాయకుడు, ఖాసీంపేట మాజీ సర్పంచ్ ఏలేటి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. చెరువులో పూడికతీత పనులకే ప్రధాని నరేంద్రమోదీ అధిక నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. రోజువారీ కూలీ సైతం పెంచారని, పేద ప్రజల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదే అన్నారు. బండి సంజయ్‌కి ఓటు వేసి మరోసారి గెలిపించాలని కోరారు. బైక్ ర్యాలీలో బద్దం వెంకట్‌రెడ్డి, బండి కిట్టు, సింగిరెడ్డి ప్రభాకర్, ఏలేటి సత్యం, కట్నపెల్లి విజయ్, సింగిరెడ్డి రాంరెడ్డి, సాయిని తిరుపతి, బొజ్జ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రం ప్రారంభిస్తున్న సంపత్‌రెడ్డి

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ, సుభాష్‌నగర్ స్టేజీల వద్ద దావు మధురమ్మ జ్ఞాపకార్థం రామకృష్ణకాలనీ రెడ్డి సంఘం అధ్యక్షుడు దావు సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాలు ప్రారంభించారు. రాజీవ్ రహదారిపై నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు ప్రయాణిస్తుంటారని, వేసవి నేపథ్యంలో వారి దాహం తీర్చేందుకు, కళాశాలల విద్యార్థులకు తాగునీరు అందించేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సంపత్‌రెడ్డిని గ్రామస్తులు, వాహనదారులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు ఉల్లెంగుల ఏకానందం, మాచర్ల అంజయ్యగౌడ్, దావు శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, సిరికొండ వెంకట్రావు, వేల్పుల ఓదెలు, గంగు నరేశ్, అలువాల కుమార్, సంపత్, గణేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌రావుపేటలో

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట పాత బస్టాండ్ వద్ద సోమవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రానికి వాటర్ ప్లాంట్స్ యజమానులు నీటి సరఫరా చేయనున్నట్లు సంస్థ బాధ్యులు తెలిపారు. అధ్యక్షుడు దాసరి కనకయ్య, ప్రధాన కార్యదర్శి దాసరి రవిశాస్త్రి, గౌరవాధ్యక్షుడు ఒద్దుల హనుమంతరెడ్డి, ముదుగంటి మధు, మేక సాయికుమార్, వడ్లూరి సిద్ధు, తడగొండ మల్లేశం, రాజశేఖర్, నరసయ్య, పోచయ్య, మోహిత్, శేఖర్, మల్లేశం పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ముజాఫర్ తదితరులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని రజ్వీచమన్, సిటిజన్ కాలనీల్లో సోమవారం సామాజిక కార్యకర్త, లోక్‌సత్తా ప్రతినిధి సయ్యద్ ముజాఫర్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కాలనీల్లో ప్లకార్డులు చేతపట్టుకుని ఇంటింటికీ తిరుగుతూ ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాబిర్ ఉల్ హక్, సయ్యద్ అఫ్జల్, గులాంఖాన్, అంజద్‌అలీ, మహ్మద్ షాహిద్, రఫీక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు